

" ధారా రమేష్ అనే నేను... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా రాబోవు రెండు సంవత్సరాలు నా బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని, సభ్యుల ఐక్యతకు, ఉన్నతికి శక్తివంఛన లేకుండా కృషి చేస్తానని, సంఘం కీర్తిప్రతిష్టతలు పెంపొందించుటకు నా సయమాన్ని, శక్తి, ఆర్థిక సాయాన్ని అందిస్తానని, ఆర్యవైశ్య మహాసభ నియమావళికి బద్ధుడనై నా పదవికి పూర్తి న్యాయం చేస్తానని సభా సాక్షిగా.. వాసవి మాత సాక్షిగా ప్రమాణం చేయుచున్నాను.." అంటూ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షునిగా దారా రమేష్ ప్రమాణస్వీకారం చేశారు.

కొత్తగూడెం, జూలై21(కెరటం ప్రతినిధి)

- ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షునిగా ప్రమాణస్వీకారం చేసిన దారా రమేష్
- పలు జిల్లా కమిటీలతో పాటు మహిళ, యువజన విభాగాలు సైతం..
- ఆర్యవైశ్య భవన నిర్మాణానికి నా వంతు కృషి చేస్తా.. : ఎమ్మెల్యే కూనంనేని
- చిన్ననాటి నుంచి దారా రమేష్ కుటుంబంతో విడదీయని అనుబంధం : ఎమ్మెల్యే రాందాస్ నాయక్
- ప్రతి ఒక్క ఆర్యవైశ్యునికి హృదయపూర్వక ధన్యవాదాలు : దారా రమేష్



బాణాసంచా కాలుస్తూ..
మేళతాళాల నడుమ కొత్తగూడెంలో భారీ ర్యాలీ

# దారా రమేష్ అనే నేను...

హాజరైన పలువురి
ప్రముఖ రాష్ట్ర నాయకులు, ఆర్యవైశ్యులు



## అంబరాన్ని తాకిన ప్రమాణ స్వీకార వేడుక






భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మిదేవిపల్లిలోని దారా ఫంక్షన్ హాల్లో ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహెూత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా బాణాసంచా కాలుస్తూ.. మేళతాళాల నడుమ కొత్తగూడెంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దారా రమేష్‌తో పాటు పలువురి ప్రముఖులు దారి పొడవునా అందరికీ అభివాదం చేస్తూ.. ముందుకు సాగారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునితో పాటు గౌరవ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, జిల్లా ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఇతర కమిటీ సభ్యులు, మహిళా విభాగం, యువజన విభాగం, నియోజకవర్గ అధ్యక్షులు తదితరులు సైతం ప్రమాణస్వీకారం చేశారు. వీరితో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మినారాయణ, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ఉప్పల శారద తదితరులు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు దారా రమేష్ మాట్లాడుతూ.. తన గెలుపునకు కృషి చేసిన ఆర్యవైశ్య యువకులకు, మహిళలకు, నాయకులకు, పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. ఫాదర్స్ డే రోజున తన తండ్రి ఆశయాన్ని నెరవేర్చడం చాలా సంతోషంగా ఉందని, గురుపౌర్ణమి నాడు ప్రమాణ స్వీకారం చేయడం మరింత ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన ప్రతి ఒక్కటికి తాను పూర్తి చేసే వాటిని మాత్రమే చెప్పడం జరిగిందని, ఆర్యవైశ్య భవనం కోసం సొంత స్థలం ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నానని, నా హయాంలోనే పూర్తి చేసేలా పెద్దల





సహకారంతో ముందుకు నడుస్తున్నామని, ఈ భవన నిర్మాణం కోసం రూ.6లక్షలు ఇస్తానని చెప్పిన మాట ప్రకారం అందజేస్తానని తెలిపారు. సంఘం భవనానికి జిల్లాలోని పలువురి తోడ్పాటు కూడా అందించడం జరిగిందని, ఇది చాలా శుభపరిణామమన్నారు. అంతేకాకుండా నా పదవి కాలంలో సొంత డబ్బులతో గ్రూప్ ఇన్సూరెన్స్ కట్టి సౌకర్యం కల్పిస్తానని తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ సభ్యత్వం 300కి పైగా ప్రమాణ స్వీకారం నాటికి చేపించడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్ రాందాస్ నాయక్, జడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు దారా రమేష్, నాయకులు దోసపాటి వెంకటేశ్వర్ రావు, శారద, విజయ్ భాస్కర్, రామలింగం, చంద్రగిరి శ్రీనివాసరావు, లగడపాటి రమేష్, నేరెళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



**రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలి.. : రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మినారాయణ**

పదవి బాధ్యతలు చేపట్టిన నూతన కమిటీ రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మినారాయణ కోరారు. జిల్లాలో సభ్యత్వాలను ముమ్మరం చేసి ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలని తెలిపారు. జిల్లా కమిటీని ఎంతో సమర్థవంతంగా నడిపిస్తూ.. నిరుపేద ఆర్యవైశ్యులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను వారికి చేరేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. సంఘం బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు.

**ఆర్యవైశ్య భవన నిర్మాణానికి నా వంతు కృషి చేస్తా.. : ఎమ్మెల్యే కూనంనేని**

ఆర్యవైశ్యులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సమాజాభివృద్ధిలో అభివృద్ధిలో ఆర్యవైశ్యల ప్రాత ప్రముఖమైందన్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన ఆర్యవైశ్యులు తమ వ్యాపారాలకు పరిమితం కాకుండా పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆర్యవైశ్య పేదలతోపాటు ఇతర వర్గాల పేదలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తూ తోడ్పాటునందించడం అభినందనీయమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించని పరిస్థితిలో సంఘం ద్వారా తాగునీరు, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, పేద కుటుంబాల వివాహాల కోసం ఆర్థిక చేయూతనందిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య భవన నిర్మాణానికి నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**చిన్ననాటి నుంచి దారా రమేష్ కుటుంబంతో విడదీయని అనుబంధం : ఎమ్మెల్యే రాందాస్ నాయక్**

చిన్ననాటి నుంచి దారా రమేష్ కుటుంబంతో విడదీయని అనుబంధం ఉండేదని, దారా రమేష్ తండ్రి దారా రామనరసింహ్వాం తన చిన్నతనంలో ఎంతో ప్రోత్సాహం ఇచ్చేవారని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో యువజన విభాగంలో పనిచేస్తున్న సమయంలో తమ ఉద్యమాలకు ఆర్థిక చేయూత కూడా అందించేవారని గుర్తు చేశారు. నూతన కమిటీ మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతూ నిరుపేద ఆర్యవైశ్యులకు చేయూత అందించాలని ఆకాంక్షించారు.

**నా వంతు తోడ్పాటు ఉంటుంది : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ కమిటీకి తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ తరపునుంచి నా వంతు తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని, నూతన కమిటీ రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని, ఇది చాలా శుభపరిణామనని, రాబోవు రోజుల్లో కార్పొరేషన్‌కు బడ్జెట్‌ను సైతం కేటాయించి నిరుపేద ఆర్యవైశ్యులకు చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు.



## కౌన్సిల్ మొత్తాన్ని నిందిస్తే

# తగిన గుణపాఠం చెప్తాం

## అవార్డు పొందిన మున్సిపాలిటీలపై అవాకులుచవాకులు తగవు

- కౌన్సిల్ పై తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు
- రూ.214 కోట్లతో అభివృద్ధి జరిగితే అది అభివృద్ధి కాదా!
- కండ్లు ఉండి కనిపించని కబోదులకు అభివృద్ధి ఎలా కనిపిస్తుంది..!?
- ప్రజాక్షేత్రంలో గెలవలేని వ్యక్తులు ప్రజాప్రతినిధులను విమర్శిస్తే సహించేది లేదు
- ఒక వ్యక్తి తప్పు చేస్తే ఆ వ్యక్తిని నిందించండి
- విమర్శలు చేస్తున్న వ్యక్తులంతా రాజకీయ నిరుద్యోగులే
- కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి



**కొత్తగూడెం, జూలై21(కెరటం ప్రతినిధి)**

కొత్తగూడెం మున్సిపాలిటీలో గడిచిన నాలుగున్నర సంవత్సరాలలో సుమారు రూ.214 కోట్లతో ప్రజా మౌలిక వసతులు, ప్రజా అవసరాలను మాజీ శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు, ప్రస్తుత శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు సహకారంతో అభివృద్ధి జరిగితే అది అభివృద్ధి కాదా! అని కొత్తగూడెం మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి ప్రశ్నించారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మందిరంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ.. కొత్తగూడెం మున్సిపాలిటీలో 36 వార్డుల్లో స్వచ్ఛ వాహనాలు, ట్రాక్టర్స్ , జెసిపి, డ్రైన్ క్లీనింగ్ మిషిన్, జెసిపిలు తదితర శానిటేషన్ వాహనాలతో స్వచ్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దితేనే కొత్తగూడెం మున్సిపాలిటీకి స్వచ్ తెలంగాణ అవార్డు వచ్చిందని ఇది అభివృద్ధి కాదా అని ఆమె విమర్శకులను ప్రశ్నించారు. గూడు, నీడలేని పేదలకు ఇంటి స్థలాలు డబల్ బెడ్ రూములు మంజూరు చేపిస్తే కండ్లు ఉండి కూడా చూడలేని కబోదుల్లాగా మీరు విమర్శలు చేస్తున్నారని ఇది వారి అవివేకానికే నిదర్శనమని ఆమె ఘాటుగా విమర్శించారు. స్థానిక శాసనసభ్యులు ఎన్నికైన ఆరు నెలల్లోనే 124 కోట్లతో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం 400 కోట్ల పైచిలుకు ధనంతో బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడం అభివృద్ధి కాదా అని అన్నారు. .సొంత ప్రయోజనాల కోసం ఒక వ్యక్తిని ,ఒక వ్యవస్థను విమర్శిస్తే సూర్యుడు మీద ఉమ్మేస్తే అది వారి మీదనే పడుతుందని వారు అన్నారు.

వీటిలో అవినీతి జరిగితే ఏ వ్యక్తి తప్పు చేశారో ఆ వ్యక్తిపై విమర్శ చేయండి అంతేతప్ప 36 మంది కౌన్సిల్ సభ్యులను విమర్శిస్తే కౌన్సిల్ తగిన గుణపాఠం చెప్తుందని ఆమె హెచ్చరించారు. మీకు ప్రజా ప్రతినిధులు కావాలని ఆకాంక్ష ఉంటే ప్రజాక్షేత్రంలో గెలవండి .ప్రజా సమస్యలపై పోరాడుదాం రండి అంతేతప్ప రాజకీయ నిరుద్యోగతతో ప్రజాక్షేత్రంలో గెలిచిన ప్రజాప్రతినిధుల్ని విమర్శిస్తే ఎవరేంటో ప్రజలకు తెలపాల్సి వస్తుందని ఆమె సోషల్ మీడియా ద్వారా విమర్శలు చేస్తున్న వారిని ఘాటుగా హెచ్చరించారు. కౌన్సిల్ మొత్తం పై నిందారోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కౌన్సిల్ సభ్యులు ముక్తకంఠంతో హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురి కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

